# కవితా విమర్శనము

శ్రీ మహమ్మద్ ఖాసింఖాన్ గారు

ఆంధ్రకవిత్వచరిత్రమున నింతవరకును స్వర్ణయుగము రాలేదు. కవులు స్వేచ్ఛాప్రవర్తనులై స్వాతంత్ర్యజీవనులై విశాలదృష్టిగలవారై కైతలు రచించినపుడే స్వర్ణయుగము ప్రాప్తించును. నేడు వంగవాఙ్మయమునకు ఆభాగ్యమే కల్గినది. పూర్వము ఆంధ్రదేశములో నన్నపార్యాది పురాణకవులు కేవలము సంస్కృతమును దెనుగులోనికి తెచ్చిరి. శ్రీనాథుడు పెద్దన మున్నగు కవులు గాయకులగు తమప్రభువులను మెప్పించుటకై శృంగార రసప్రధానములగు ప్రబంధములను రచించిరి. పోతన అబ్బయ మున్నగు కవులు స్వేచ్ఛాగానమొనర్పఁ జూచిరి గాని పూర్వకవులమార్గము ననుసరించక తప్పినది కాదు వారికి. ఇరువదవ శతాబ్దము స్వర్ణయుగద్వారము నించుక తెరచినది. ఈ ద్వారమునకు మార్గము చూపిన మహనీయుడు గురుజాడ అప్పారాయకవి. ఆమార్గముననే వెంకట పార్వతీశ్వర కవులు, రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, వేదుల సత్యనారాయణశాస్త్రి, పురిపండా అప్పలస్వామి, దువ్వూరి రామిరెడ్డి, బసవరాజు అప్పారావుగార్లును మరికొందరును ఒకరివెనుకనొకరు కలిసి క్రమపడి కొంతవరకు స్వర్ణయుగ ద్వారమును తెరచిరి. మిగిలిన సగమునకై పెనగుచున్నారు, ప్రస్తుత ఆంధ్రవాఙ్మయస్థితి యిది.

ఈ సందిగ్ధసమయమునందు యుగపురుషులెవ్వరో నిర్ణయించుటకు వీలులేకయున్నది. సాధారణులెవరి ననుసరించవలసినదో తెలియుట లేదు. ఒకరికిని మరొకరికిని సంబంధము లేక ఎవరికి వారే ముందునకు రా బ్రయత్నించుచున్నారు. దీనికి తోడు పల్వురు ఉమాకాంతులు బయలుదేరుచున్నారు. మరికొందరు వాళ్లు పద్యాలను గీకి కవులమని బిరుదముల నిచ్చుకొనుచున్నారు. కొందరు ఏదో ఒక సంస్కృతగ్రంథమును తెనిగించి 'మేము కవిసార్వభౌములము' మనుచున్నారు. ఇట్టి అల్లకల్లోలమగు స్థితియందున్నది ఆంధ్రవాఙ్మయప్రపంచము. ఈసమయమునందు కవుల గుణాగుణములను నిష్పక్షపాతబుద్ధితో విమర్శించి నిగూఢములగు వారి భావములను గ్రాహ్యములుగా నొనర్చి, చదువరులకు రుచిగల్గించి కవినామధేయులగు వ్రాతకాండ్ర విశృంఖలమును వారించుట విమర్శకుల విధి. ఆంధ్రపాఠకులు ఆధునిక కవిత్వమునకు అలవాటు పడియుండలేదు, అలవాటుకాని పరమాన్నము సహిత మొకొక్కసారి రుచింపకుండుట మన యనుభవమే. అట్టి ఆధునికకవిత యందు అభిరుచి గల్గించుటయే ప్రస్తుతవ్యాసోద్దేశము.

ప్రస్తుతము స్వర్ణయుగప్రాప్తికై పాటుపడుచున్న ఆంధ్రకవిలోకమునందు ప్రసిద్ధి వడసిన శ్రీయుత పురిపండా అప్పలస్వామిగారి నరయుదము. వీరు నిర్మలజీవనులు, పవిత్రస్వభావులు, సౌందర్యపిపాసులు. ఇట్టివారి గీతికలందు సహితము సత్యమును సౌందర్యమును ధ్వనించుచుండును. అట్టి కవిత్వమే మానవుల హృదయమును పక్వ మొనరింపజాలును. Ruskin మహాశయుడు 'All right human song is the finished expression, by Art, of joy or grief of noble persons, for right causes.'* అనిచెప్పి తిరిగి And accurately in proportion to the rightness of the cause and purity of the emotion, is the possibility of the fine art.'† అన్నాడు, ఇది సత్యమే: ఒక పవిత్ర ప్రణయమూర్తి తన ప్రియతమునై పాడవచ్చును గాని, ఒక లుబ్ధాగ్రేసర చక్రవర్తి తనపోయిన ధనమునకై పాడలేడు. అందుచేతనే పాడునట్టి వ్యక్తియందు పవిత్రత్వము, నైర్మల్యము హృదయసౌందర్యమును యుండవలెను. అట్టివాని గీతములయందే అమృతముండును. ఇట్టిచో ప్రస్తుత వ్యాసవిషయముగా నెవ్వరి నొందువాయని ఆలోచించి తగువారు కొలదిగా యుంట, వారిలో ప్రప్రథమమున శ్రీపురిపండా అప్పలస్వామిగారినే ఎన్నుకొనగల్గితిని. తక్కిన వ్యాసములలో మిగిలిన వారి నొకొక్కరిని గైకొని ఆనుపూర్విగ విమర్శింతును.

* ఉదాత్తులు సద్హేతువులకై కళామార్గమున ఆనందమునో శోకమునో లలితముగ వెలిబుచ్చుటయే నిజమైన మానవగీతము'.

† హేతుసాత్వికమునకును భావోద్రేకమునందలి పవిత్రతకును సంబంధసామ్యమున్నప్పుడే లలితకళకు సాధ్యత కలదు.' (Lectures on Art.)

ఈ వ్యాసమును రెండుభాగములు రచించితిని. ప్రథమభాగమున కవివ్యక్తిత్వ నిరూపణము గావించి, ద్వితీయభాగమున కవిత్వ నిరూపణము గావింతును.

1 A. శ్రీ అప్పలస్వామి గారు ప్రస్తుతపు టాంధ్రరంగమున ప్రఖ్యాతిగాంచిన కవులలో కడుయువకులు. వీరికిప్పుడు ఇరువదినాలుగేండ్ల ప్రాయముండియుండవచ్చును. వీరి జన్మస్థానము ప్రకృతిదేవీమందిరమగు సాలూరు, కవి ప్రకృతియంకమందే పెరిగెను. 'హరితశాద్వల నిచయములు' కవికి క్రీడారంగములు— 'అహముహు సుగంధములంగొని యుపహారమొసగు సాయంకాల సమీరార్భకు'లును 'మలకలై గిరిశృంగముల దిగ్గి పారు సెలయేర్లు'ను 'తెగలు తెరలుగ గుమిగూడి యంబరపథాన' విహరించు జలదమాలికలను ఆటగాండ్రు కవికి. అందుచేతనే కవి ప్రకృతిసౌందర్యాంధులగు నాగరికులను సంబోధించి ప్రకృతిదేవీమందిరవాసులగు జానపదుల 'సౌఖ్యమరయలే'మనుచున్నాడు.

ప్రకృతిదేవికి ముద్దుబాలకుల్వీరు

సత్యమార్గవిలీన దివ్యజీవితులు' అని వారి ఔత్కృష్ట్యమును వెల్లడించుచున్నాడు కవి. దీనికితోడు కవి తన పదునైదవయేట భారతదేశ సంభ్రమణ మొనరించినట్లు తెలియవచ్చుచున్నది.

" భరతదేశ, సంభ్రమణావసరము నందు
మున్ను రామేశ్వరము దాక చన్ననాడు
ఆ పవిత్రపుష్కర దివసాళిలోన
* * *
గౌతమీ నీదు సలిలాన గాత్రము న
ఎన్నిసార్లు మున్గితినో నా కెఱుక రాదు "

ఇట్లు బాల్యమునుండియు ప్రకృతిదేవిరాజ్యమున పరిభ్రమించి ప్రకృతిసౌందర్యమును తనివి తీర గ్రోలి ధన్యుడైనాడు కవి.

కవికి చిన్ననాడే పద్యరచన పట్టుబడెను. నాల్గు భాషలందు ప్రవేశము కల్గినది. (పాశ్చాత్యభాషలు కావు.) దానికి తోడు దేశభక్తి దృఢముగా హృదయమున నాటుకొనెను. దానితో భావోద్రేకము వచ్చినది. భారతమాత దుస్థితిని గాంచినంతనే కవికి హృదయము పొంగినది. 'కటకటా! ఎట్లైతివే కన్నతల్లి!' అనికన్నుల నీరు నించినాడు. ఇంతలో కవి దృక్పథము మరింత విశాలమైనది. సంఘమునందలి రాక్షసకృత్యములు గోచరించినవి. వృద్ధవివాహములు అస్పృశ్యత, హిందూమహమ్మదీయ ద్వేషములు కన్పట్టినవి. కవిహృదయమును చీల్చికొని వచ్చినవి రక్షణమంత్రములు. 'పంచమ విలాపము' 'దాస్యార్థి' రుధిరార్పణము.' 'కలదొ కల్లదొ' 'తల్లి' 'కౌరవసభలోని పాంచాలి' మున్నగు కావ్యములు యీ సమయమందు వెలసినవియే. కవియొక్క కవితాజీవితములో నిది యొక యవస్థ.

ఇంతలో కవి 'ప్రేమసంగీతమును బాడు హృదయతంత్రి' విషాదగీతి నాలపించినది. కవిజీవితమునందిదొక పరివర్తనము. కవి 'ప్రణయసామ్రాజ్యలక్ష్మి' అతని నెడబాసి 'అనంతవీథి మెఱుపు తెరలలో మాయమైపోయెను దాగి'. 'విరతిలేని యీచీకటి వెదకులాట' కు 'ప్రభాతమ్ము గాంచు భాగ్యాతిశయము మరి కలదో లేదో' అని కవి సంశయించును. 'ఏల గిరవాటు వైచెద వీ విషణ్ణకుటిల కర్దమసంకీర్ణకూపమునకు సగము చీదని యీ పసి జాజిమొగ్గ' అని పరమేశ్వరుని ప్రశ్నించును. 'నా హృదయకరుణార్ద్ర కోమలసద్గీత ధ్యానమున' 'లోకమంతయు వ్యాకులత ప్రకటింతు గాని కఠినహృదయుడవోయి నీమది కరుగలేదా! ' అని విధిని దూరును. కాని కవిదుఃఖమెంతవరకు విస్తరించినది? 'నేను మరణించుచున్నాను' అను నంతవరకును దుఃఖదావానలము వ్యాపించినదో లేదు. ప్రకృతిసిద్ధమైన మానవదుఃఖమునకు, అందునను, జ్ఞానులకుండదగు దుఃఖమునకు మితియున్నది. ఆ మితి నతిక్రమించుట కేవలమజ్ఞానము. అజ్ఞానము కాకపోయిన

నటింపు (Affectation) ప్రియకములు ఎదబాసి పోయినపుడు 'నేను చచ్చిపోతనని నూతిలోపడబోవువారిని పొడుచుకొనబోవువారిని, మూఢసంఘములలో పల్లెటూళ్ళ గాంచుచుందుము. కాని ఆదుఃఖము తాత్కాలికము. దీనినే తుచ్ఛావేశమందురు (Vulgar emotion) కాని, ఇదియొక కవికి తగదు. కవియన సామాన్యుడు కాడు కవి ప్రవక్త. కవి బ్రహ్మజ్ఞాని. అందుచేతనే అతడెంతదుఃఖమునైనను సాహించగలడు. ముందుముందు శోకవారాశి యుప్పొంగి అతని హృదయమును ముంచబోవవచ్చును. కాని, కవికి ఆత్మశక్తి కలదు. అతడు ముందువెనుకలరయును, ఉచితానుచితముల భావించును. అతడు ప్రపంచమునకొక సందేశము నీయవలయునన్న విషయమును జ్ఞప్తికి తెచ్చుకొనును. దుఃఖబాదబమును ధైర్యసముద్రమున దాచివేయును. 'హృదయభారమ్ము లోలో సహించుకొనుచు' 'వేదనావహ్ని నిరతమ్ము నైచికొని క్రుంగి కుమిలి యస్పష్టరీతి క్రందనమొనర్చు'ను. 'నేను స్వేచ్ఛాదరిద్రజీవితుడ నెట్లు జలదాల చేరగలనో?' యని శంకించునంతలోనే 'అమృతగంధిల మా లతాంతముల నడుమ, నే నొకసుమంబునై పుట్టినానె గాని సార్థకత గాంచ నోచుకో జాలనైతి.' నని అనుతాపించి 'శిశిరయామినీ మిహికాశ్రు సేచనమున, హ్లాదమే విస్మరిలిన కళ్యాణ విటపి, చివురు చేలాంచలాల వానించు పరిమళమ్ము త్రిభువనమ్ముల విరజిమ్ము' టకై 'విషాదజలజపంక్తి' నుండి మెఱపు వలె బయల్పడును. స్వీయసందేశమునందు తనకు సంపూర్ణ విశ్వాసమును కుదురుకొల్పును. 'మనకు వియోగము లేద' ని 'ప్రోజ్వలాంబర వీధులందు నిలిచి ఎదురు కని' తన కొఱకు విలాపించు ప్రేయసిని'

> "ప్రేయసీ! త్వన్మనోహర మృదులమూర్తి
> నాదరిని లేకపోయినంతటనె నాకు
> ప్రణయసామ్రాజ్యమున కబ్బు భంగమేమి ?
>
> * * *
>
> కవికుమారుడ గానె? మర్త్యల్పనా ప్ర
> పంచమున నాకు దొరకని వస్తువున్నె?
> నేను స్వేచ్ఛావిహంగమనేల గానె?
> నాకు దొరకని తావు ముల్లోకములను
> వెదకి చూచిన గలదె దేవీ! నిరంకు
> శాధికారిని, సద్వరసంభవుండ,"

నని ఊరడించి తాను ధైర్యము తెచ్చుకొనును. ఒక్క వాక్యములోనే అగాధ ప్రణయము, స్వీయవిశ్వాసము, స్వేచ్ఛాపిపాస, ఓదార్పు, అహార్యధైర్యము యున్నియు మేళవించి కవి కమ్రతత్వము నిచ్చుచున్నవి. కవి కష్టసమయమున మానవసహజముగా పరమేశ్వరుని నిందించును. దాని కిప్పుడు పశ్చాత్తాపము. కృతజ్ఞత! తనపూర్వహృదయదౌర్బల్యమున కనుతాపము!

> 'తాలిమి యొకింతయేని స్వాంతమున లేక
> తీవ్రభాషల నిన్ను నిందించుచున్న
> హే ప్రభూ! యీ ఖలాత్మునెపై నెన్నడేని
> అలుకబూనవు ప్రేమమై నాదరింతు
> వహహా! నీదు వాత్సల్యమేమని నుతింతు!

తుదకు కవి తానీ లోకమును వీడుటకు పూర్వము తన సందేశహారణ కార్యమును ముగింపనిమ్మని దేవుని ప్రార్థించుకొనును. 'జాతస్య మరణం ధ్రువ' మ్మను ఆర్యోక్తిని మననమొనర్చుకొని తనకా 'ఘోరదుస్థితిరాకముందె దీన బోరలు శీతలకణమేని యుపకరింపనిమ్మోయి! పావనప్రేమ నొందవ యుష్మదంచిత పూజామహోత్సవ్రతికి' అనును. సందేశహారణకార్యనిర్వహణమనగా కవియొనర్చు మానవసేవయే. అదియే అతనికి ప్రభుపూజ. ఎంతటి పవిత్రమనోరథము!

కాని ఇన్నాళ్ళు మూగవోయిన తన హృదయవీణ తిరిగి ఎట్లు పాడునా యని కవికే యాశ్చర్యము. దాని తానేవో మహాస్వరములు పాడవలసియున్న దని అతనికి ధృఢవిశ్వాసము. వినుము కవి పరమేశ్వరుని కడ అమాయకుడై పోవుచున్నాడు!

> 'ఈ దరిద్రవీణ నేల మీటెదవోయి
> సడలుమెట్ల నేల సాకెదోయి
> తెగిన తంత్రులేల తీర్పజూచెదు స్వామి!
> ఏస్వరాల పాడ నెంచినావొ?'

కవిజీవితమునలో తృతీయావస్థ ఇక్కడ నుండి మొదలు. 'తొలి వసంతోదయమి'ది. ఇంతవరకును తన ఎదురుగా నిలిచియున్న అంతకు నిప్పుడు,

> 'స్వాప్నికచ్ఛాయ లటుల వాసరము లెన్నొ
> గడచిపోయెను జీవితాకాంక్ష లెవియు
> తీరనే లేదు, తృషిత యాత్రికుడ నేను
> ఓయి వికటాట్టహాసమృత్యుగ్రమూర్తి!
> అపుడె నిల్చితివేల నా ప్రాంగణాన?'

అని విదలించును. 'ప్రభాతమ్ము గాంచు భాగ్యాతిశయము మరికలదో లేదో' అనుకొనిన కవికి ఆభాగ్యమిప్పుడు సంధిల్లినది. ఇప్పుడాతడు "తరుణభువనాలకీ ప్రభాతాలె వెంగ' 'కలోన్నదయ ప్రణయగీతులను' పాడ సంకల్పించినాడు. ఇంక యీవసంతమునం దెట్టి పుష్పములు వికసించునో చూతము.

ఇంతవరకును కవి కవితాజీవితమునందలి అవస్థల నించుమించుగ విభజింప గల్గితిమి. ఇది కవియొక్క వ్యక్తిత్వనిరూపణమునందలి ప్రథమభాగమని చెప్పవచ్చును. ఇక సంగ్రహముగా కవి మానసస్వభావమును కొంత నిరూపింప యత్నింతును. ఇది వ్యక్తిత్వనిరూపణమునందలి ద్వితీయభాగము.

1. B. ప్రకృతి తత్వము:—కవి ప్రకృతిదేవి యొడియందే పెరిగెనని యింతకు ముందే చెప్పియుంటిని. అందుచేతనే అతనికి ప్రకృతియందు మాతృప్రేమ. ప్రకృతి అతనికి శివము. కవి తనభావములను ప్రకృతితో మేళవించి రసాత్మకముగ పాడగలడు. అతనికి 'తరుల్ కేకేలు వేయు ' అతని 'హృదయకరుణార్ద్రలోచనముల నవ్యగీతాధ్యానము'నకు 'విఫలబ్యందావనము కన్నులు నీరు నించినది,' 'యమునా తరంగిణి కరగిపారినది;' 'హరిత శాద్వల నిచయమెల్లెడ శిరము వాల్చినది;' 'కమ్మ తెమ్మెర నిలువనేరక చెమ్మగిల్లినది.' కాని కవి ప్రకృతి విషయమున ప్రాథుండు కాలేదు. మార్గమును విడలేదు. కాళిదాసు, Shakespeare, Wordsworth, Keats వలె నితడు ప్రకృతియందు జీవములను పఠించలేదు. ప్రకృతి చిత్రములను చూచి "వత్తినోలె నేమేమొ భావించు"ను. ఒక్కొక్కసారి Tennyson * వలె ఒకసూనమును చే నిడికొని 'తెల్పకవ్యమ్మ కాంతిజీవకళ నెట్టి సౌరభమ్మునింపూర్చి భావ్యరత కేర్చి నీవు చూపిన ఘనసైపుణీవిభవము హృదయము హరించు'నని సృష్టికర్తను ప్రశంసించును. ప్రకృతిచిత్రముల కిట్లు రిచ్చవడుచు తనువు మరచి తన్నిర్మాతయగు పరమేశ్వరుని కడ 'దాసినై పోవగోర్కె యుద్భాసితము'గనును. ఇంతకుమ కవికూరట లేదు. ఇంకను తెలిసికొనవలయునన్న పిపాసయే. 'ఈవిచిత్ర వినిర్మాణ మే విధాన, నేరికడ నేర్వగల్గితి నీవు నాథ!' యని ప్రశ్నించును. కాని దానికి ప్రత్యుత్తరము లేదు. కవియందిది యొక లోపమనను గాని ప్రకృతితత్వమున నిదియొక అవస్థ. ఈఅవస్థ ఎట్లు పరిణమించునో కాలము నిర్ణయింపగలదు. పరిణామమునకు కొన్ని ఛాయలప్పుడే కనపరచుచున్నాడు కవి. చూడుడు.

> 'ఇంత తెలిమబ్బు మింట కాన్పించునేని
> అమృతమె యొల వర్షించు నామ్రవిటపి
> చిరుపవన మింత గిలిగింతపరచునేని
> గళము సవరించునేల రాగాల తరువు
> ఏ సనాతనబాంధవ్యమేమొ సఖుడ!'

2. స్వేచ్ఛాతత్వము:—కవి స్వేచ్ఛయందే ప్రథమించెను. 'నేను స్వేచ్ఛావిహంగమనేల గానె' యనియు 'నిరంకుశాః, కవయః' యను న్యాయము ననుసరించి 'నిరంకుశాధికారి' ననియు కవి చెప్పుకొనును. 'జీవికపులకు స్వేచ్ఛయే ప్రధానము'ని కవియే కాలధర్మము నిరూపించినాడు. కవికి సారస్వతవిషయమున నేకాక తక్కిన విషయములందు సహితము స్వేచ్ఛాపిపాసయే. (పారతంత్ర్యవిశృంఖలాబద్ధులైన హైందవుల' దస్థితి కింతయు నొచ్చుకొని విద్యావంతులైన ఆంధ్రులను 'ఈ యపూర్వప్రత్యయమ్మున, నింక శయనించెద విదేటికి, మేలుకొనుమో తెనుగు కొమరుడ,

*'I hold you here, and all, in my hand, Little flower,—but if I could understand what you are root and all, and all in all I should know what God and Man is.'

Tennyson,

చాలు నీనిద్దుర' అని మేల్కొల్పెను. పూర్వపు ఔన్నత్యమును జ్ఞప్తికి తెచ్చి ప్రస్తుతపు దానిస్థితికి కన్నుల నీరునించుచు ఉద్రేకమును రవుల్కొల్పెను. సింహాచలమును దర్శించినపుడు "ప్రతి తరుచ్ఛాయాతలమ్మున, ప్రతి శిలాశకలాంతరమ్మున, సురుచిరాంధ్రౌన్నత్యమ్ముం గని, కరుగవందర ఆంధ్రుడా!' అని ఆంధ్రకుమారుల కేపును. పద్మనాభమును దర్శించినపుడు కవి హృదంతరాళమునుండి కరుణారసము పొంగినది: 'ఆ నిశాంతకశోరదృశ్యావలోకనమున సహజార్ద్రి హృదుల మానసము చెదర, కంట నీర్వట్టి నిలువక కరగిపోరు. నేటికిని నైత మీగోస్తనీ ప్రవంతి' అని తన హృదయమును అచ్చట పారు ప్రవంతియందు ప్రతిఫలింపజేసినాడు. అంతలో కోపము వచ్చినది. దానితో క్రోధము! అవమానము! ఉద్వేగము! ఒక్కపెట్టున

'ఓయి! జీవచ్ఛవాంధ్రుడా! ఒక్కమారు
పలుక నిమ్మట నింత కవోష్ణబాష్ప
మలినధార, స్వాతంత్ర్య సంప్రాప్తి కొరకు.'

అని అరచినాడు కవి.

3. భావౌదార్యము:—ఈకవియందున్న దగిన మరొక మహా విశేషమున్నది. అది ఇతని భావౌదార్యము. సృష్టియందలి ప్రతి యణువునందును సమత్వమారోపించు ఈమహాగుణ మీకవి కొక యలంకారము. విషమున నైతము గుణమున్న, దానిని గ్రహించి, యమృతమున నైతము దుర్గుణమున్న దానిం విసర్జించుట కవికి సైజము. దానికుదాహరణముగ నీకవి రచించిన 'రుధిరార్పణము'ను గనుడు. దానిలో:

'అమ్మరో! నీకు కన్గవయె యా గద హిందుమహమ్మదీయ సంఘమ్ములు రెండు, అందు పలుగాకి తురుష్కుడొకండు ద్రోహమార్గమ్మున వెచ్చి నీదు కుడికంటిని భగ్నమొనర్చె స్వామిప్రాణమ్ములం దీసి ; దాస్యమున వల్గెదు నీవెటు దీని నైతువో ?'

అనునపుడు కవి మాటల నెట్లు తూచివైచెనో చూడుడు! 'హిందు మహమ్మదీయ సంఘమ్ములు రెండు నీదు కన్గవయొ' అని ముందు రెంటికి సమత్వమారోపించినాడు. తరువాత దుర్గుణుడగు హంతకుని 'పలుగాకి...ద్రోహమార్గమ్మున వెచ్చి నీదు కుడికంటిని భగ్నమొనర్చె'నని దూరినాడు. ఇంకను:

'హంతకుని చేతం గాల్పబడితె?
అయిన నేమాయె, నీరుధిరార్పణమున

* * *

కుటిలవైమనస్యభావముల్ కూలకున్నె'

అని శ్రద్ధానందస్వామి రుధిరార్పణమునందలి దుఃఖమునకన్నను తత్ఫలితమగు హిందూ మహమ్మదీయద్వేషవినాశనమున కెక్కుడానందమును గాంచుచున్నాడు కవి. 'విడగదలపెట్టరాదె మీ ద్వేషబుద్ధి, హైందవమహమ్మదీయులారా యికైన' అని వారి నుద్బోధించుచున్నాడు. ఇదెంతయు శ్లాఘనీయము. మరొకచో కవి పతనమునొందిన 'పంచమమాత' ను గని దానిని శాపాదరం బని భారతీయులను గొంతెత్తి పిల్చెను. మేలుకొల్పెను. - మేలుకొ యనగా కేవలము మేలుకాదు. ఆమేలుకొలుపుయందొక అంతరంగిక, అదృశ్య అధికారస్వరము నినాదించుచున్నది.

4. రసావేశమునందలి సరళత:—ఈకవి భావోద్రేకమునందు సహజసరళత యొప్పుచున్నది. మానవప్రవృత్తియందలి చిక్కులితనియందు కానరావు. భావములందు జటిలత్వము లేదు. కవి వ్రాయునది కవులకొరకే కాదు. మానవుల కాతడు మధురజలముల నొసంగవలెను, కవి సెలయేటి నుండి కడుపార మధురరసమును గ్రోలి మానవులు తృప్తినొందుదురు, అందుచే యీ మధురజలము ప్రజల అందుబాటులో నుండవలెను. అట్లుకాక మధురజలము దీనిలో యున్నదని ఒక మహాకూపమిచ్చిన ఆ మధురజలము నాస్వాదించు టెట్లు? Tennyson కు సమకాలికుడై అతనికన్న వేయిమడుంగులు హెచ్చు కవితాహృదయము కలవాడయ్యు Browning నేటివరకును టెన్నిసనుపాటి కీర్తి గడింపలేకపోవుటకు రహస్యమీ జటిలతయే. అట్లే Thackery. అంతయేల సంస్కృతమున బాణునకును, ఆంధ్రమున వసుచరిత్రకారుడైన రామరాజభూషణునకును వారి కవితలయం దిదియే పెనుభూతమై పొంతనైనను చేరనీయకున్నది. మనకవి కా రహస్యము తెలియును.

ఇతని భావములు అతిసరళములు. అతడా భావములను లలితముగను సుబోధములుగను పాడగలడు. కవిస్వభావమే ఇతని కవిత్వమున ప్రతిఫలించినదని చెప్పవచ్చును. అన్ని విషయములందును ఇంతగా వ్యక్తిత్వమును కవిత్వమున సజయముగ ప్రతిఫలింపజేసిన కవులలో నీకవి ఉత్కృష్టుడు.

దీనితో వ్యక్తిత్వనిరూపణము నింక సూచనగా విరమించి యీతని కవిత్వమును కొంత పరీక్షింతము. ఈతని కవితయందు మనోజ్ఞకళాచాతుర్యము కాన్పించుచున్నది. కవితాసామగ్రిని గూర్చి యనేక సృష్టిచిత్రములనిచ్చు సృష్టిపరిశీలనము, పదప్రయోగమునం దౌచిత్యమును, ఉపమానములందు ప్రకటించు చిత్రకారకళయు, పదలాలిత్యమును, రసపుష్టియు. ఇతని కళాకోవిదత్వమునకు కడలేని గౌరవమును తెచ్చిపెట్టుచున్నవి. ప్రత్యేకముగ నొక్కొక్కగుణమును గైకొని చర్చింతును.

1. సృష్టి పరిశీలనము:—కళావిదునిగా కవిని నిరూపించునపుడు అతని కళానిర్మాణమునకు ముఖ్యముగా కావలసిన సృష్టిపరిశీలన మితనియందెంతవరకు కలదో చూతము. కవికి ప్రకృతియం దత్యానురాగము. ప్రకృతియం దితడు కేళి సల్పగలడు. ప్రకృతియం దేకాంతముగ సానందుడై విహరింపగలడు. ప్రకృతిని బాగుగ పరిశీలించును. ఇంతవరకును బాహ్యపరిశీలన మందే కవి తన కాలమును గడపెను. అంతఃపరిశీలన మిప్పుడిప్పుడే ప్రారంభించినట్లు కన్పట్టుచున్నది. కవి ఒక ఉద్యానవనమునో, ఒక పర్వతమునో, ఒక యాటవికజీవితమునో, ఒక సెలయేటినో, ఒకవసంతమునో, ఒక ప్రాతఃకాలమునో, ఒక చంద్రోదయమునో కడుమనోజ్ఞముగ వర్ణింపగలడు. ఈ వర్ణనలందు ఇతని పరిశీలనాచ్ఛాయలు స్పష్టముగ కన్పట్టుచుండును. కొన్నిటి నుదాహరింతును. కవి తన స్వగ్రామపరిసరములం దున్న పారమ్మకొండల వర్ణించుచు:

'అస్తమయ భానుకిరణమ్ము లలమువేళ
కమ్మచూపుల ముగ్ధభావమ్ము తోప
కుటజముల సేకరింప నిచ్చట చరింత్రు
గదబ కన్నెలు వనవిహంగములు వోలె'

అని ఎంతో మనోహరముగ నచటి సాయంసమయమును వర్ణించెను. మరొకయెడ.

'నవనవోన్మేష సంధ్యారాగవిస్ఫూర్తి
కాళయామినిలోన కలసి పోవుచునుండె
విహగసీమంతినీ విమలగీతరుతమ్ము
నిశ్శబ్ద తమసాన నీరవించుచు నుండె;

ఇక్కడ కాళరాత్రిని కలసి పోవుచున్న సంధ్యారాగము కన్నులకు కన్పట్టుచునే యున్నది. క్రమక్రమముగ నిశ్శబ్దమగు చీకటి సమీపించుచున్నకొలది నశించుచున్న పక్షుల కలకలారావము కర్ణములయందు ప్రతిధ్వనించుచునే యున్నవి. మరొకచో కులాయములనుండి ప్రాతర్వేళల నెగురుచున్న పక్షులను గాంచి

'నలుదెసల మ్రోగుచున్నది నిలిచి నిలిచి
నవ్యమధుర్మము విహగవీణాస్వనమ్ము.'

అనును. 'విహగవీణాస్వనము నిలిచి నిలిచి నలుదెసల మ్రోగుచున్న' దట. ఎంతటి సూక్ష్మపరిశీలనమో! మరొకయెడ కవి ఎగురుచున్న పక్షులను వర్ణించుచు, 'కలకలారావముల మింట వలయములయి, పాఱు శుకశారికలు' అని కన్నులకు కట్టినట్లు చిత్రించెను. సాధారణముగ 'శుకశారికలు' తప్ప మరేవియు నట్లు వలయాకారములై కిలకిలలాడుచు నెగురవు.

వృక్షలోకమునందు కవి గాంచిన పరిశీలనమును గనుడు:—'చివురు చేలాంచలాల వాసించు పరిమళమ్ము' చివుళ్ళలో పరిమళము! వసంతకాలమున పుష్పములు లేని వృక్షలతాదులు సైతము వాసించును. ఇది పల్లవపరిమళము. మరొకటి గనుడు,

'ఇంత తెలిమబ్బు మింట కాన్పించునేని
అమృతమె యేలవర్షించు నామ్రవిటపి.'

మబ్బు పూచిన మామిడిచెట్టుపై నిల్చినపుడు అది తేనె కురియునట! ఇది సృష్టి రహస్యము. ఆంధ్ర సాహిత్యమున కొక క్రొత్త విశేషము-అలంకారమును!

ఇంక చెప్పిన కొలది యితని కవిత్వమునం దిట్టి వెన్నియో కలవు. వ్యాసవిస్తరభీతిచే వానిని గుణగ్రహణపారీణులగు పాఠకులకే విడిచి పుచ్చుచు ఒక్కసారి సింహావలోకన మొనర్తును. కవి కనన్యసాధ్యమగు సూక్ష్మపరిశీలనాశక్తి పూర్తిగ నున్నదని చెప్పవచ్చును. ఆధునిక కవులలో నింతసూక్ష్మముగ ప్రకృతి పరిశీలనము గావించిన వారు లేరని చెప్పిన యతిశయోక్తి కానేరదు. శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారు * నైతమీ విషయమున వీరికి వెనుకబడక తప్పినది కాదు.

2. భావసంకోచము:—(Expressiveness) ఈకవి కళయందు మరొక విశేషము కానగును. ఒక్కొక్కప్పుడు కవి ఒక్క మాటయందే తన హృదయమునంతను పుష్పింపఁ జేయుచుండును. ఎన్నో మాటలలో చెప్పవలసిన యొక పెద్దచిత్రమును ఒక చిన్న పదమున నిరికించి ఉంగరపు పాడియందు తాజ్ మహల్ ను చూపినట్లు మన కన్నులకు కట్టివేయును. కొన్నిటి నుదాహరింతును:—

'సువర్ణరేఖాజాలదీపితము'
'తొలిమల నిండు సొబగు'
'విహగవీణాస్వనము'
'విరజాజి నవ్వులు'
'కల్లోదయ ప్రణయగీతి'
'ఆంధ్రశిల్ప కళామహోన్నతి
ఆంధ్రవిజ్ఞానోరుదీధితి
విస్తృతమేఘ పథాల దాటుచు వెలయు నిచ్చోట.'
'దరిద్రవీణ.'

ఇట్టి వక్కడక్కడ మెరుపులవలె కన్పట్టుచుండును. కవికి శక్తి పూర్తిగ నబ్బలేదు. ప్రయత్నము కాన్పించుచున్నది. ఇది యభివృద్ధికైన కవి కన్నతస్థానము నారోహించుట కొక సోపానముగ నుపకరించును. ఆధునికాంధ్రకవులందీ శక్తి పరిమితము కొలదిగా కన్పట్టుచున్నది. ఇది శోచనీయము.

3. ఉపమలు:—కవి కుపమానముల నుపయోగించుటయందు కడునేర్పు కలదు. ఇతని ఉపమానములు స్వతంత్రములై, హృదయాకర్షములై, ఉన్మేషకములై, చిత్రకారుని హృదయమునందలి ప్రతిమలవలె తేజోద్దీపితములై యుండును. ఉపమాన మెల్లప్పుడును మన భావములను స్ఫుటీకరించుచుండవలెను. దానికి తోడు కావ్యమున కందము గల్గించవలెను. అందుచేతనే మన లాక్షణికులు,

శబ్దార్థామూర్తి రాఖ్యాతౌ, జీవితం వ్యంగ్యవైభవమ్
హారాదివ దలంకారా॰ తత్ర ·స్యు రుపమాదయః *

అని ఉపమాద్యలంకారములు కావ్యకన్యకకు హారాదిభూషణములని నిర్వచించిరి. భావప్రస్ఫుటత్వమునకై యుపమాదుల నుపయోగించవలెను. కాకపోయిన వాని సంపూర్ణోపయోగము కానరాదు. అందుచేతనే విమర్శకశేఖరుడు Samuel Johnson తన 'Life of pope లో " A smile to be perfect must both illustrate and ennoble the subject; must show it in an understanding in a clearer view, and display it to the fancy with greater dignity.' అని చెప్పి తిరిగి 'But either of these qualities may be sufficient to recommend it, అని నుడివెను. Johnson చెప్పినట్లే కవి ప్రతియుపమయును భావమును సానపెట్టుచుండును. భావములకున్న ప్రకృతిసిద్ధసౌందర్యమును అభివృద్ధి కొందించుచుండును. మనకు చిత్రపటములను చూపును. కొన్ని యుదాహరణములను గనుడు:

'చిరుపవన మింత గిలిగింత పరచునేని
గళము సవరించు నేల రాగాల తరువు'

'అస్తమయ భానుకిరణమ్ము లలమువేళ
* *
కుటజముల సేకరింప నిచ్చట చరింత్రు
గదబ కన్నెలు వనవిహంగములు వోలె.'

ఇందు గదబ కన్నెల స్వేచ్ఛాజీవనమును స్ఫురింపజేయుచున్నాడు కవి.

'మరణదేవి నిశ్వాస ధూమ్యమ్ము లటుల
క్రమ్ముకొని వచ్చు నీ తిమిరాల తెరల
చీల్చుకొని వచ్చి'
"చండాంశుకిరణ ప్రచండతాపమున
ధూమ్యసంకాశమై తూలిపోయితిని"
* * *
"నా సుధానిధి వచ్చునా యీరేయి
నా జీవితము నిల్చు నా
* * *
చిక్కనగమైన యీచిరుతారక నొకింత
కరము కరమునం జేర్చునా
నారాజు
కౌగిలంతల దేల్చునా?"
"ప్రణయసామ్రాజ్యలక్ష్మి నా భాగ్యరాశి
* * *
నన్ను నెడబాసి పోయిన నాటనుండి
నామనోబ్జమ్ము ముకుళించి నవసిపోయె
అమలతరమైన నాహృదయాంబరమున
నలముకొని నిల్చె విషాద జలదపంక్తి
ప్రేమసంగీతముం బాడు హృదయతంత్రి
మోదశ్రుతి నాలపించె విషాదగీతి."

"రభసమున పారు భీకరతరంగివోలె" పోవుచున్నదట రాధ కృష్ణుని వెదకుచు.

ఇట్లే పెక్కుపట్టుల నీకవికి ఉపమానములందు గల చాతుర్యము గనవగును. 'ఉపమా కాళిదాసస్య' అని జగత్ప్రఖ్యాతి గాంచిన కాళిదాసమహాకవియం దితని కమితాభిమానమని పొడగట్టుచున్నది; అందుచేతనే గాబోలు. దీనికి క్రింది యుదాహరణమును గనుడు:

"నఖలు నఖలు బాణస్సన్నిపాత్యోయ మస్మిన్
మృదుని మృగశరీరే పుష్పరాశా వివాగ్నిః
క్వ బత హరిణకానాం జీవితం చాతిలోలం
క్వ చ నిశితనిపాతా వజ్రపాతా శ్శరాస్తే॥"

అను శాకున్తలమునందలి కాళిదాసమహోక్తి నెట్లు ప్రతిధ్వనించెనో చూడుడు:

"ఎంత దారుణమొక్కొ మహేంద్రు చేతి
యశనిపాతమ్ము కాలాంబుదాలనుండి
విస్ఫులింగాల వెదజల్లి భీషణోగ్ర
నిస్వనాలతోఁ బడియె దానిమ్మవిూద."

కాని యిది కేవలము ప్రతిధ్వని గాదు. అవార్యాలీ అనగా దానిమ్మ మొగ్గ. కవి ఆ యర్థముచే పద్యమును హృద్యముగ ధ్వనింపఁ జేసినాడు. కాని యీకవికి కాళిదాసమహాకవి యందలి యభిమానముతో మేళవించిన దీ ధ్వని.

కల్పనాశక్తి:—ఇంక కవులకు ముఖ్యమగు కల్పనాశక్తి యీకవి యం దెంతవర కున్నదో చూతము. ఒకబీజము నుండి చెట్టును మొలిపించి చివుళ్ళకొడిగి పుష్పములచే నలంకరింపఁజాలు శక్తి కవులది. అటులనే మహాకవి కాళిదాసు భారతవృక్షమునుండి శకుంతలా బీజమును రాల్చి దాన తన యభిజ్ఞానశాకుంతల

* ఈ విషయము శ్రీవారిపై వ్రాయబోవు వ్యాసమున చర్చింతును.
* శ్లోకమునకు నరసభూపాలీయము:
'తనువగు శబ్దార్థంబులు
ధ్వని జీవములంక్రియావిశేషము హార్యాల్
తనర గుణంబులు గుణములు
మనవృత్తులు వృత్తులౌర కావ్యేందిరకున్'

పారిజాత తరువును సృష్టించెను. అట్లే షేక్స్పియర్ మహాకవి తన దేశీయ గాథల గొని వానిని మహాకావ్యములుగ మార్చివేసెను. ఈ శక్తి సామాన్యకవుల కబ్బదు. వారొక చిన్న సూత్రముపై కావ్యము వ్రాయలేరు. ప్రస్తుతము మనకవి కీర్తి సంపూర్ణముగా నున్నదని తెల్పుటకు రెండు కావ్యములు కలవు. అవి 'చిత్ర నాటకము - అనార్కలీ.' వీనిని కొంత విమర్శింతును. 'చిత్ర నాటకము' నను కావ్యమునకు బీజము తెనుగులో నున్న 'జగన్నాటక సూత్రధారి' యను భగవద్విశేషమై యుండవచ్చును. ఆ బీజముపైననే కవి తన కావ్యవల్లరిని సృష్టించెను. ఇంతకు పూర్వము ఆంగ్లకవులు పల్వురీ భావబీజమునుండి వివిధ కావ్యవల్లరులను సృజించి యున్నారు. ఈకవుల వల్లిక లెట్లెట్లు వ్రాసిరో పరికింతము. పాఠకులు క్షమింతురు గాక Shakespeare కంటె పూర్వుడు 'Legend of Orpheus' కావ్యకర్త:

'Unhappy Man!  
Whose life is a sad continuous tragedie,  
Himself the actor, in the world the stage,  
While as the acts are measured by his age.'

(ఓ అభాగ్య మానవుడా! నీ జీవిత మొక విషాదాంత నాటకము. నీవే నటుడవు. ప్రపంచమే రంగము, నీ ఆయు రవస్థలే అంకములు.) తరువాత Shakespeare కవి Merchant of venice లో: 'I hold the World but as the world,--;A stage where every man must play a part.' అని చెప్పెను. Oldys అను నతడు Shakespeare గాథలను వ్రాయుచు నొక సంభాషణము నిట్లు పొందుపరచుచున్నాడు:

"Benjonson :---'of, but stage actors, all the world displays,  
Where shall we find spectators of their plays?"  
Shakespeare :---Little, or much, of what we see, we do;  
We are all both actors and spectators too."

ప్రేక్షకులము నటులమును మనమే యని యీ పద్యభావము. ఈ నాటకమున కంటె విభజనము సైతము గావించినారు. మానవుని సప్తావస్థలే అంకములై మానవ నాటకము సప్తాంకితమైనది. ప్రతివ్యక్తియు నొక్కొక్క నాటకము నాడుచుండునని 'Legend of Orpheus' కావ్యకర్త చెప్పుచున్నాడు. అట్లైన ఒకే రంగముపై కోట్లకొలది నాటకము లాడబడుచున్నవని ఇతని అభిప్రాయము కాబోలు. ఇదియు సమంజసముగ నున్నది. Shakespeare చెప్పిన దానిలో ప్రపంచము ఒక రంగమనియు ప్రతిమానవుడు నొక్కొక్క పాత్రను ప్రదర్శింపవలయుననియు భావము. కాని Benjonson కు వచ్చిన 'ఐన ప్రేక్షకు లెవరు?' అను సందేహము మనకు రాక తీరదు. దానికి కవి చెప్పిన 'మనమే నటులము, మనమే ప్రేక్షకులము'ను సమాధానము యుక్తముగ లేదు. ఎందుకనిన ఇది ప్రకృతి విరుద్ధము. ప్రేక్షకులు లేని నాటకము నెవరును ప్రదర్శించుట లోకము నందెన్నడును విని యుండలేదు. ప్రస్తుతమీ 'చిత్రనాటక' కారుడగు మనకవి ఆస్తికుడు. ఆంగ్లకవుల కావ్యాంతరాళములనుండి నాస్తిక్యనాదము ధ్వనించుచునే యున్నది. మనకవి ప్రపంచమంతయు నొకటే నాటకరంగము. ఈ నాటకము 'ఎన్నడును సమాప్తము కానిది. 'కల్పము లతీతములై పోయినను సరే. ప్రతియుదయమునను అవని లేచును. ప్రతిరాత్రియును అవనిక జారును. నాటకమున కడచిన రంగములు తిరిగి రావు. 'చనిన పాత్రల కిక ప్రవేశమును లేదు'; 'తవిలి వచ్చు నాగలకు నంతమును లేదు.' దీనికి ప్రేక్షకులెవరని కవికి సందేహము కలుగక పోలేదు. కాని దానికి ప్రత్యుత్తరమతని కసాధ్యముగా తోచెను. కవి యుక్తికి గడగలేదు. అది యొక ప్రహేళిక యని అతనికి తెలియును. కాని దానితో ఆగలేదు. నాటక సూత్రధారినే ప్రశ్నించెను:

'ఎవరి మెప్పింప నెందాక నీ యనంత  
చిత్రనాటక మిటు ప్రదర్శింతు వోయి!'

ఈ చిత్రనాటకము'న కర్థమేమి యని మరొక సందేహము. ఏ గ్రీకునాటక ప్రదర్శనమునో గాంచుచున్నట్లైనది కవికి. కవి కాశ్చర్యము- తెలిసికొనవలయునన పిపాస! దానితో

'అర్థమే కాని నాటక మాడుచుందు  
వోయి నాటకసూత్రధారీ యి దేమి?'

అని ప్రశ్నించెను.

ఈ కావ్య మాంగ్లకావ్యములకన్న నుత్తమమను విషయము పాఠకులకు నేను వేరుగ చెప్పనక్కరలేదు. ఇట్టి కావ్యము లాంధ్రభాషలో అరుదు.

రెండవకావ్యము 'అనార్కలీ.' ఈమె జహాంగీర్ చక్రవర్తి యువరాజుగానున్నప్పుడు అతడు ప్రేమించిన ఒకానొక ప్రణయమూర్తి. చరిత్రపాఠకులకీమె విషాదచరితము విశ్రుతమే. అనార్కలీ (దానిమ్మపువ్వు) ఒక మధుకరుడు ప్రేమించినట్లును దానిమ్మపూవు తుదకొక వజ్రపాతముచే 'కఠినమృత్తికా గర్భాన కలసిపోయి' నట్లును అంతరార్థయుతముగ 'రచించినా డీ కావ్యమును కవి. దీనిని కొద్దిగా విమర్శించి తక్కినది రసగ్రహణపారీణులగు పాఠకులకే విడిచిపుత్తును.

అనార్కలి ముగ్ధ. వసంతకాలము నందలి నందకవన శోభతో యలరారుచున్న దామె. ఆమె

'అసుధాపూర్ణ మృదులశోణాధరాంచ  
లముల నూతన దరహాస లలిత రేఖ  
కరగి పోలేదు; యౌవన తరుణ శోభ  
వాడి పోలేదు; ప్రణయభావ ప్రపూరి  
తాంతరంగ మధురవాంఛ లడగ లేదు.'

అంతలోననే 'అశని పాతమ్ము కాలాంబుదాలనుండి విస్ఫులింగాల వెదజల్లి భీమ ఘోర నిస్వనాల'తో (బడెను. అంత 'దురంత మృత్యుదంష్ట్రిలను చిక్కి సుమబాల తనువు వీడి కఠినమృత్తికా గర్భాన కలసి పోయి'నది. సుమము నశించగానే 'ఆ హతభాగ్య బంభరుని' యెడద వ్రయ్యలై పోయినది. తుద కతడు 'ఉన్మత్త భయద శోకమూర్తియై' పోయినాడు. కవి నైపుణ్యమును గనుడు. ప్రథమమున 'అనార్కలీ' యౌవనమును వర్ణించి మన హృదయములను బంధించి చేసి క్రమముగా వజ్రపాతములను కురిపించి ఆమెను మృత్యుదంష్ట్రిలను చిక్కించి మన గుండియల వ్రయ్యలు చేసినాడు. తరువాత మధుకరుని స్థితిని చిత్రించి పాఠకులచే కన్నీటిని కార్పించినాడు. కవి చెప్పిన ట్లీ 'దైన్య (గీతి) నిర్మలార్ద్రిస్వనాన ఇప్పటికి కూడ చిరవిరహైక జీవులకు నినాదించుచునే యున్నది. కవి ఈ రెండు కావ్యములను తన యగాధకాల్పనిక భావనాశక్తియు కళాకౌశలమును కడు హృదయంగమముగ ప్రకటించినాడు.

భాష-శబ్దశ్రావ్యత:—కవి కళాపరిణతికి భాషా విషయమొకటి ఆలోచనీయము. కవుల భాష రమణీయమై, శ్రావ్యమై, సరళమై, గ్రామ్యమై యుండదగును. 'రమణీయార్థప్రతిపాదకం కావ్యం' అని రసగంగాధరకారుడు. Ruskin అను ఆంగ్లేయ విమర్శకుడు పద్యపంక్తికి నిదర్శనముల నిచ్చుచు "Melody in the words, changeable with their passion, fitted to it exactly, and the utmost of which the language is capable in verse, nobler by submitting itself to stricter laws.' అనుచున్నాడు. జగన్నాథపండితుల వాక్యము నే తిరిగి చెప్పుచు రసముల మార్పుతో భాషయు మారుచుండవలెనని చున్నాడితడు. మన కవి కళయం దిది యొక ముఖ్యాంగము. ఈ పదౌచిత్యము, పదలాలిత్యమును ఇతనియందు గనుగొంతము. భావములు మారుచున్నకొలది భాష మారుటను నీక్రింది యుదాహరణమును గనుడు.

'నా నిదానమ్ము నా బహిఃప్రాణ శుకము  
పంజరంబున బంధింపబడి దురంత  
చింతచే నెంతయును వలవంత జెందె;'

ఇక్కడ నుండి భాష మారినది:

'అయ్యయో! తల్పంబరాంతరమున  
అడు గిడగనీరు మోమెత్తి యరయ నీరు.'

ఇట నిస్పృహ జెంది సోలిపోవు బహిఃప్రాణము భాష ననుసరించుచున్నాడు.

'ఈ వియోగాగ్ని నిక భరియింపలేను  
కటకటంబడి కన్నీరు కార్ప లేను.'

మరికొన్నిటి నుదాహరింతును. 'విషు' మని వచ్చుచున్న రామదాసును వినిన ఛత్రపతి శివాజీని వర్ణించునపుడు:

'సంగరమ్మున వైరికుంజర కవోష్ణ  
రక్తధారలజిమ్ము వీరప్రతాప

*'జగన్నాటక సూత్రధారి యదునందను దర్శించి మ్రొక్కి మ్రొక్కి నా.' పాట

కాలి కనుగవ నశ్రులఁ దేలవిడిచె
బిచ్చమని వచ్చు సన్యాసి పిలుపు వినిన.'

అని శివాజీ చరిత్రమునకు తేజము గల్పించినాడు. కవి సద్రేకము వచ్చినప్పటి భావను తిలకింపుడు!

'భయద దాస్య విశృంఖలా బంధితుడవు
ఓయి జీవచ్ఛవాంధ్రుడా! ఒక్కమారు
పలుకనిమ్మట నింత కవోష్ణ బాష్ప
మలినధార స్వాతంత్ర్యసంప్రాప్తికొరకు.'

మరొకచో ఇంచుక మృదువుగ:

'మాతృపూజాధ్యానతత్పర
మతిఁ బవిత్రస్నాతుడవునై
విశ్వమందిరపుణ్యభూమికి
వెడలి రావోయి!'

దీనిని గనుడు:

'ఓయి నాగరికుడ! కోరు లీకడలందు
అనుభవించు సౌఖ్య మరయవేమి ?
కుటిలదాంభికానుకూలుండ వీ వేడ
ఈ యమాయకుల ప్రవృత్తు లేడ?'

సంబోధనమునందును మూడవపాదమునందును గల భావకును ప్రథమపాదోత్తరఖండమునను, ద్వితీయపాదమునందును, చతుర్థపాదమునందును గల భావకును భేదము చెప్ప నక్కరలేకయే స్పష్టముగా కనపడుచున్నది. ఇట్లే యీకవి ప్రతి కావ్యమునందును భావ వివిధరూపములతో విరాజిల్లుచుండును. ఈవిషయము నింక విస్తరించక కవి పదలాలిత్యమును కొంత చర్చింతును.

ఇతని కవిత్వమునందు శ్రావ్యతతో కూడుకొనిన మాధుర్యమున్నది. రాయప్రోలు సుబ్బారావు, వేదుల సత్యనారాయణశాస్త్రి, కృష్ణశాస్త్రిగార్ల కవితలంవలె యితని కవిత్వమునకును యిదొక ముఖ్యాభరణము. నిర్ఝరిణివలెగాక ప్రశాంతముగు నిర్మలప్రవాహమువలె పారుచుండు నితని కవిత. ఈ మాధుర్యమునకై కవి ప్రయత్నించినట్లు కన్పట్టదు. అది నైసర్గికము, కోకిలపాటవలె ధ్వనించుచుండును. 'Style is the man' అను పాశ్చాత్యసూత్రమును బట్టి ఇది కవిస్వభావమే యేమో! మురళీధ్వనిని చదివి శ్రీ శివశంకరశాస్త్రిగారు 'గీతిలో మాధుర్యం స్ఫురిస్తున్నద'ని వ్రాయుట దాన మధువును గ్రోలియే. చదివిన కొలదిని వీరికావ్యములు చదువవలయుననియే మన కగును. 'మురళీ ధ్వని'లోని 'ఆహ్వానము' నాలకించి కావ్యమునంతను పూర్తిగా ఎవరు చదువ కుందురు?

'జీవితం వ్యంగ్యవైభవమ్' అనియు, ధ్వనియే కావ్యసిద్ధినొందించుననియు మనలాక్షణికులు. ప్రస్తుతకాలమునందు ధ్వనికావ్యములే ఆదరింపబడుచున్నవి. మన కవియు కాలము ననుసరించక తప్పినదికాదు. ఈవిధముగు కవితయం దితని కెక్కుడు ప్రీతి. ఇది యొక ప్రత్యేకవ్యాఖ్యానవిషయమైనను క్లుప్తముగా నిట చే బొందుపరుప యత్నింతును. కవి భావోచ్చారణమున సాధ్యమైనంతవరకు ప్రచ్ఛన్నముగనే యుండును. బాహాటముగ పైకి రానెంచడు. 'మురళీధ్వని' ఆహ్వానమునందు తానొక 'బాలగోపాలమూర్తియై మురళి నాలింప రమ్మ'ని 'గోపికారమణుల'ను పిల్చును. మరొక కావ్యము*న ఆశయందు తా నాశ్రయమును గల్పించుకొనగోరి 'వేగుజుక్క'ను (ఆశ) సంబోధించి :

'సుంతి దయజూచి నన్ను నీచెంత జేర్పు
మేమొ! యటనైన దెలవారు నేమొ నాకు!'

అనును. వేరొక కావ్యము♦న ప్రేయసిని 'బహిః ప్రాణశుకము'గా చెప్పి తద్బుకము 'పంజరాంతరము'న బంధింపబడి యున్నదనియు (అనగా తనకందుబాటులో లేని యొకచో) ఆటను తన్ను వెళ్ళనీయకున్నారనియు (కవి దానికి కారణముగ 'నేను స్వేచ్ఛాచరిత్రజీవితుడ'నని చెప్పుకొనియే యున్నాడు.) తెరచాటునుండి విలాపించును. ఇంకొకచో కవి తానొక విటపియై :

'శిశిర యామినీ మిహికాశ్రు సేచనమున
హ్లాదమే విస్మరిలిన కళ్యాణవిటపి
చివురు చేలాంచలాల వాసించు పరిమ
ళమ్ము త్రిభువనమ్ముల విరజిమ్ము నేమొ
తొలి వసంతోదయమె సంధిలగ నేడు.'

అని తన జీవితమునందలి పరిణామమును వ్యాజ్యముగ సూచింపజేయుచున్నాడు.

ఇట్లే కవి సాధ్యమైనంతవరకు అవనికాభ్యంతరమునందే యుండఁ జూచెను. ఇది యీకాలపు పోబడియైనను కవి యందలి శక్తులలో యిది యొక యుత్కృష్ట శక్తి యనక తప్పదు.

ఈధ్వనికవిత్వము క్రమక్రమముగా 'మర్మకవిత్వ' మనబడు Mystic Poetry గా పరిణమించినది. ఈవ్వక కవితయందు కవి Omar khayyam, Rume, Athash మున్నగు ప్రణయోపాసకులగు కవిసార్వభౌములవలె సహిత మక్కడక్కడ పాద గల్గినాడు. ఇదెంతయు గర్వింపదగిన విషయము!

కవి యీకవిత్వమున సహితము స్థితులను (stages) కనపరచినాడు. ప్రప్రథమమున కవికి పరమాత్మయందు 'కలవో, లేవో' యను భావ ముండెడిది. ఇది ప్రథమావస్థ. భగవంతుడే యున్నచో ప్రపంచ మింత కలుషపూరితమై యుండునా యనియో లేక నరేకారణమునకో పరమేశ్వరుని యందు కొంత 'ఈసడింపు' నైతము చూపినాడు కవి. కాని అవ్యక్తము, అస్తికరక్తము అతని నాళములను ప్రవహించుచునే యున్నది. మేఘగర్భమునుండి మెరుపులు తళుక్కు మనుచునే యున్నవి. ఇంతలో కవి 'భగ్నహృదయు'డైనాడు. ప్రపంచమంతయు నతని కంధకారమయముగ తోచినది. ఎక్కడ చూచిన నతనికి నరకవార్తయే వినవచ్చుచున్నది. 'నగము పీడని పన్న జాజిమొగ్గ', కుటిల కర్దమ సంకీర్ణకూపమున కూలినది.' కవికి మృత్యుదేవత 'వికటాట్టహాసము' గావించుచు ప్రత్యక్షీకరించెను. ఇదంతయు కవికి నరకమే. కవికి భగవంతుని యునికి యందు మరింత యనుమానము. వినను ఆర్య అస్తిక్యరక్త మాతని నెంతోదూరము పోనిచ్చినది కాదు. 'ఈనరకమేమి? పరమేశ్వరుడు కృపాపారావారుడు కదా' అని అతనిని సందేహ మింకను పీడించుచునే యున్నది. భగవంతునితోఁ గొంతెత్తి:

'Shall he that made the vessel in pure Love and Fancy; in an after rage destroy' అను ఉమర్ ఖయాముని'పాత్ర'వలె

'స్వర్గభూమి సృజించు హస్తములతోడ
నేల రచియింపజూచెదో యీ మహోగ్ర
తర భయానక కిల్బిష నరకసీమ'

అని కేక వేయును. ఉమర్ ఖయామ్.

"What lamp had Destiny to guide Her little children stumbling in the Dark"

అని కేకవైచి ఏ ప్రత్యుత్తరమును బడయకపోయెను కవి కూడ నదే ప్రత్యుత్తరము నొందెను. అప్పుడు కవి తిరిగి ఉమర్ ఖయామ్ వలెనే

"Then to the Earthen Bowl did I adjourn My lip, the secret Well of Life to learn."

అనుచు ప్రణయపాత్ర నధరమును చేర్చును. సందేహముల నన్నిటిని ప్రణయపాత్రమునందే ముంచివేసెను. అంతలోనే తానొక ప్రణయమూర్తియైపోయినాడు కవి. తాను 'శిలలాంతముల నడుమ తానొక సుమమ్మునై పుట్టినా'నని తెలిసికొనును. కాని తానొక తేజోమూర్తి అంకము నుండి అంధకారమున జారిపడినాడని తెలియు నతనికి. ఈ అవస్థలో కవి 'ఆర్తి' పెట్టినాడు. 'గాఢాంధకార సంకలిత దుర్గమ భూమి నను డించి పోయెద వేల నా నాథ నాపైని కోపమేల? అనియు ఆత్మ సంజనిత ఘోరార్త ప్రణాదంబు నాలింప రావేలనో నా నాథ! జాలి చూపవదేలనో?' అనియు మొఱపెట్టుకొనును. మఱొకచో

'కడ గానరాని యాకాశమార్గమున
పరువెత్తి పరువెత్తి బడలిపోయితిని
జంఝానిలో న్మత్త సంచాలనమున
నిలువ లేకొక్కింత నలిగిపోయితిని

* *

* 'వేగుజుక్క.'

♦ 'నిర్బంధము.'

హృదయేశ! యికనైన కృప జూడవే.
ఈపంకమున నే లయించి పోయెదను"

అని చెప్పుకొనును. ఇ-తలో కొంత యూరట 'శాంతి'యు 'విశ్రాంతి'యు నిప్పుడు విద్యుల్లతలవలె మెరసినవి. ఎన్నాళ్లీ ఆర్తి; ఈ 'చీకటి వెలుగులాట' యని కవి

'ఈ చిఱుత సెల యెన్నడైన యీ నికృష్ట
వాలుకాభూమి మధురజీవనము విడచు'

నని ఆర్తితో *

'నిర్మలాంబువులను స్వర్ణకుంభముల నింపుము రయాన;
నిలువదో యేమొ తొలిమల నిండు సొబగు
శేత వలపుల నే నివాళించు వరకు,
వలుదెవల మ్రోగుచున్నది నిలిచి నిలిచి
నవ్యమధురమ్ము విహగవీణాస్వరమ్ము,
పొదల నునుమంచు కరగి పోవుటకు మున్నె
బరువులు దేరు'మని తొందరపెట్టుచున్నాడు.

తుదకు కవికి ప్రణయపాత్రయే ఆశ్రయమైనది. కవి తనప్రియాకరమున శోకవీణయై ప్రియావియోగ దుఃఖము నణచివేయుటకై కల్పోదయ ప్రణయగీతులను పాడ నెంచినాడు. సహృదయుల కింక నేమి కావలయు!

ఇంతవరకును కవియందలి గుణములను నిరూపించితిని. కాని కవియందు కొన్ని లోపములు లేకము కాన నగును. కవి కవితాజీవితమునందు తరుణదశ నున్నాడు. ఇంకను హ్రస్వకావ్యము (Short poems) తోనే పెనగులాడుచున్నాడు. దీర్ఘకావ్యములు రచింపకుండుట కవి కొక లోపము. స్వీయప్రవృత్తిని చిత్రించుటయందుకన్న సామాన్యమానవప్రవృత్తి చిత్రించుటయందే కవి తన కవితాశక్తులను చూపఁగలఁడు. హ్రస్వకావ్యములందు కవి కవకాశము తక్కువ. 'కవియె విశ్వము, విశ్వమేకవి' యను విబుధోక్తి సత్యమే. అయినను కవి కవకాశము హ్రస్వకావ్యములందు లేదు. ఉన్నను అది చాలదు. విశ్వకవులందరును తమ దీర్ఘకావ్యముల యందే మానవప్రవృత్తులను చిత్రించి అఖండయశోవిరాజితులైరను విషయము కవి మరువకుండును గాక!

రచనాబాహుళ్యములేమి కవియందు మరొక లోపము. అల్పకవులందు రచనాబాహుళ్యము ఒకలోపమైనను ఉత్తమ కవులయందిది యొక మహాగుణమని చెప్పక తప్పదు. ఉత్తమ కవుల హృదయములు నిరంతరము భావపరంపరలచే ఉప్పొంగుచునే యుండును. Addison అను ఆంగ్లకవి!

'I bridle in my struggling Muse with pain
that longs to launch in a nobler strain'*

అని ఉద్రిక్తమైన తన కావ్యదేవత నైకి రానుద్యోగించుచున్నదనియు దానిని తానాపుకొనలేక పోవుచుంటి ననియు వచించెను. ఇది ఉత్తమకవిలక్షణము. కవి అట్లు వచ్చు తన భావముల కాకారము ప్రసాదింపవలెను. ఆ ఆకారము మనోజ్ఞమై యుండవలె నని చెప్పనే అక్కరలేదు. సౌందర్యదేవతాధిష్ఠాన హృదయుఁడగు మనకవి కిది లోపమని చెప్పిన పాఠకులు నన్ను మన్నింప రని భావింతును. ఇట్టి లోపములను సవరించుకొనినచో నీకవి ఆంధ్రలోకమునకు ఆదర్శప్రాయుఁడగు ననుటలో సందియ మించుకంతయును లేదు.

విరమించుచూ! శ్రీ పుసపండా అప్పలస్వామికవి గారి హృదయమే వారి కవితయందు హృద్యముగ ప్రతిఫలించినది. వారి హృదయౌదార్యము, నిష్కాపట్యము, సరళత్వము, సౌందర్యము మున్నగు సద్గుణములన్నియు చక్కని ఛాయాపటమందు వలె వీరి కవిత్వమున కాన నగును. పెక్కురయందువలె వీరికిని వీరి కవిత్వమునకును భేదము కాన్పించుట లేదు. ఇది ఉత్తమకవి లక్షణము. ఈ మహాగుణమే వీరికి ఉత్తమకవి బిరుదము సాధించుచున్నది. వీరిట్టివే అమూల్యములగు తమ కావ్యసౌందర్యముల విరజిమ్మి 'The beginning of Art is in getting our country clean and our people beautiful' అను Ruskin మహాశయుని వాక్యమును ఆంధ్రదేశమున కన్వయించి ఆదర్శప్రాయులై కీర్తి నందుదురు గాక!

---

* ఈఘట్టమున ఉమర్ ఖయాం గీతిని చూడుడు.

'Come, fill the cup, in the Fire of Spring;
The Winter Garment of Repentence Fling;
The Bird of Time has but a little way
To fly—and Lo! the Bird is on the Wing!'

ఉమర్ ఖయాంలో భాషానిగ్రహము భావనిగ్రహము రెండును మూర్తీభవించినవి. కాని రెండు గీతలు శోకవీణపై నాలపించిన రెండు మధురస్వరములవలె నున్నవి.

*Quoted by Samuel Johnson.

---

# ప్రణయభరము

శ్రీ వేంకటవీరరాజ కవులు, కవితాసమితి

మొగమొ! కళాపరిపూర్ణశశాంకబింబమొ! నిర్ణయింప నెవ్వని తరంబు!
అక్షులో! అమృతపద్మాకరభవలసత్సారసంబులో! తెల్ప నేరితరము!
నాసావరంబొ! సువాసనావాస చాంపేయమో! వివరింప వీలుపడునె!
కబరీభరమొ! రత్నకలితకాలాహిరాజంబొ! విభేదింప శక్య మగునె!
అవనతాంగిరొ యున్నది అదియు నొక్క- అందమో! లేక సూక్ష్మమధ్యంబు కతన
కుచభరంబు వహింపక యచట నటులు వంగియున్నదో! తెలిసికొనంగ దరమె!

ఉ. దీని ముఖారవిందమును దీని విలాసము దీనిచూడ్కులున్
దీనిమనోహరమున్ గనిన ధీజనసత్తముడైన నిర్మల
జ్ఞానము వీడి, మన్మథనిశాతశరాహతులన్ స్మరించి, యా
జ్ఞానపయోబ్ధిమగ్నుఁ డయి సంతతమున్ చరియింపకుండునే!

తే. అకట! పదునారువేలగోపికల గూడి-సరససల్లాపములు సదా సలుపుచున్న
చారుసౌందర్యసీమ! ఈ సత్యభామ!-సామెయిని లేనిచో కృష్ణనామ మేడ!